సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 6 । సెప్టెంబర్ । 2024



శిథిల గదుల్లో చదివేదెలా?
మాచారెడ్డి, పాల్వంచ మండలాల్లోని పలు పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరాయి. విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.
- 8లో ▸



సబ్ కలెక్టర్ పర్యటన
నస్రుల్లాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సబ్ కలెక్టర్ కిరణ్మయి పర్యటించారు. పాఠశాలలను పరిశీలించారు.
- 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
32.0 /22.2
ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

‘గ్లోబల్ సమ్మిట్’కు హాజరైన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే



ఎల్లారెడ్డి: హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమానికి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హైదరాబాద్ శివారులో 200 ఎకరాలలో ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి సీఎం కృషి చేస్తున్నారన్నారు.

పోషణ మాసం పోస్టర్ల ఆవిష్కరణ



కామారెడ్డి క్రైం: దివ్యాంగుల, మహిళల, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పోషణ మాసం పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. మూడేళ్లలోపు పిల్లలకు సరైన పోషణ లేకుంటే మెదడు ఎదుగుదల మందగిస్తుందన్నారు. ఈ వయస్సు పిల్లల పోషణ విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అంగన్‌వాడీల్లో బాలింతలకు, పిల్లలకు పోషణ ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లా సంక్షేమశాఖ అధికారి బావయ్య, జిల్లా ఆరోగ్యశాఖ అధికారి చంద్రశేఖర్, అడిషనల్ డీఆర్‌డీవో మురళి, సీడీపీవో శ్రీలత పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ

కామారెడ్డి క్రైం: కలెక్టరేట్ సమీపంలో గల ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గురువారం పరిశీలించారు. ఈవీఎంలను పరిశీలించి రిజిస్టర్‌లో సంతకం చేశారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఎలక్షన్ సూపరింటెండెంట్ తదితరులు ఉన్నారు.

పథకాలను వినియోగించుకోవాలి




బీబీపేట : ప్రజలు ప్రభుత్వ పథకాలను సరైన రీతిలో వినియోగించుకోవాలని ఏపీడీ వామనరావు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 3వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికలో మాట్లాడారు. జాతీయ ఉపాధి హామీ పనుల తనిఖీ వివరాలు చదివారు. కొన్నిచోట్ల పనిచేయకున్నా చేసినట్లు బిల్లులు లేపారన్నారు. చాలాచోట్ల మొక్కలు చనిపోయాయన్నారు. మస్టర్‌లో అనేకచోట్ల కొట్టివేతలున్నాయి. పనిరోజులకు తగ్గట్లుగా డబ్బులు పడలేదన్నారు. నివేదికపై ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్, ఏపీవో రజిని, ఎస్‌ఆర్పీ మహేశ్వర్ తదితరులున్నారు.

బాధ్యతలు స్వీకరించిన బోధన్ సబ్ కలెక్టర్

బోధన్: బోధన్ సబ్ కలెక్టర్‌గా ఐఏఎస్ అధికారి వికాస్ మహతో గురువారం బాధ్యతలు స్వీకరించారు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన వికాస్ మహతో 2022 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్ ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆర్డీవోతోపాటు తహసీల్దార్ విఠల్, ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందజేసి వికాస్ మహతోకు స్వాగతం పలికారు.

రెండు పంటలకు భరోసా!

- దంచికొట్టిన వానలతో తీరిన సాగునీటి కష్టాలు
- ప్రాజెక్టులు, చెరువులన్నీ నిండుకుండలు
- ఉబికి వస్తున్న భూగర్భజలాలు



నిజాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: ఆలస్యంగా కురిసిన భారీ వర్షాలు రైతాంగానికి ఊరటనిచ్చాయి. నాలుగైదు రోజుల పాటు కురిసిన వర్షాలతో నీటి వనరులన్నీ జలకళను సంతరించుకున్నాయి. వాగులన్నీ పొంగి ప్రవహించాయి. ప్రాజెక్టులు, చెరువులన్నీ నిండుకుండలుగా మారాయి. భూగర్భజలాలు ఉబికివస్తున్నాయి. దీంతో ఈ వానాకాలం సీజన్‌తో పాటు వచ్చే యాసంగి సీజన్‌కు భరోసా ఏర్పడింది. జిల్లాలో వానాకాలం సీజన్ మొదలైన నాటి నుంచి గురువారం వరకు (సెప్టెంబర్ 5) 682.1 మి.మీ. సాధారణ వర్షాపాతంకు గాను 838.5 మి.మీ. వర్షాపాతం నమోదైంది. సాధారణం కన్నా 22.9 శాతం అదనంగా కురిసింది. సెప్టెంబర్ 5 వరకు అంటే ఐదు రోజుల్లో 28.7 మి.మీ. సాధారణ వర్షాపాతం నమోదు కావాల్సి ఉండగా 262.2 మి.మీ. వర్షాపాతం నమోదైంది. కాగా జిల్లాలో 5.42 లక్షల ఎకరాల్లో పంటలు సాగైనట్టు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. కాగా ఆరుతడి పంటలకు కాలం అనుకూలంగా నడుస్తోంది. ముఖ్యంగా మక్క, పత్తి, సోయా పంటలు కళకళలాడుతున్నాయి. ఇప్పుడున్నట్టే నడిస్తే పంట దిగుబడులు కూడా పెరుగుతాయని రైతులు ఆశతో ఉన్నారు.

ఈ సీజన్‌లో నమోదైన వర్షపాతం (మి.మీ.లో..)

నెల	సాధారణం	కురిసింది	తేడా(శాతంలో)
జూన్	144.8	128.9	-10.9
జూలై	250.9	305.2	21.6
ఆగస్టు	257.7	142.2	-44.8
సెప్టెంబర్(5 వరకు)	28.7	262.2	813.5
మొత్తం	682.1	838.5	22.9

జిల్లాలో సాగైన పంటల వివరాలు..

పంట	విస్తీర్ణం(ఎకరాల్లో..)
వరి	3.11 లక్షలు
సోయా	90 వేలు
పత్తి	32 వేలు
మక్క	44 వేలు

ప్రాజెక్టులన్నీ ఫుల్లు

జిల్లాలో ప్రాజెక్టులన్నీ నిండుకుండలుగా మారాయి. కేవలం నాలుగు రోజుల్లోనే అన్ని ప్రాజెక్టులు పొంగిపొర్లాయి. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం చేరుకోవడంతో మూడు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. అలగే పోచారం ప్రాజెక్టు పోటెత్తింది. నాలుగురోజులుగా పొంగుతోంది. కౌలాస్‌నాలా నిండింది. కల్యాని ప్రాజెక్టు, సింగీతం రిజర్వాయర్లు పొంగి పొర్లుతున్నాయి. దీంతో ఆయా ప్రాజెక్టుల కింద వానాకాలంతో పాటు యాసంగి పంటలు కూడా పూర్తిస్థాయిలో పండుతాయని భావిస్తున్నారు. మొన్నటి దాకా నీళ్లు లేవని ఆందోళన చెందిన ఆయకట్టు రైతాంగం ఊపిరిపీల్చుకుంది.



అలుగు పారిన చెరువులు

జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలతో చెరువులు దాదాపు అన్నీ అలుగులు పారాయి. అక్కడక్కడా కొన్ని చెరువులు మాత్రం నిండలేదు. జిల్లాలో 1,515 చెరువులు, కుంటలు ఉండగా 14 వందల పైచిలుకు చెరువులు అలుగులు పారాయని నీటిపారుదల శాఖ అధికారులు పేర్కొన్నారు. దీంతో చెరువులు కింద ఆయకట్టుకు ఢోకా లేకుండాపోయింది. అంతేగాకుండా వర్షాలతో ఎత్తిపోయిన బోర్లల్లో భూగర్భజలాలు ఉబికివస్తున్నాయి. జిల్లా అంతటా భూగర్భజలమట్టం పెరిగిందని భూగర్భజల శాఖ అధికారి సతీష్‌యాదవ్ తెలిపారు. వానలతో వాగులు, ఒర్రెలు పొంగి ప్రవహించడంతో భూగర్భజలమట్టం పెరిగిందన్నారు. వర్షాలు లేక భవిష్యత్తుపై బెంగ పెట్టుకున్న రైతులు నాలుగు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలతో ఉపశమనం కలిగింది. నీళ్లు లేక బోసిపోయిన చెరువులు, ప్రాజెక్టులన్నీ నిండి అలుగులు పారడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. వానాకాలం సీజన్‌కు పూర్తి స్థాయిలో నీరు అందనుంది. అదే సమయంలో యాసంగికి ఢోకాలేదని చెబుతున్నారు.

నిజాంసాగర్ మూడు గేట్లు ఎత్తివేత

నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు ఉధృతంగా వస్తుండటంతో గురువారం నిజాంసాగర్ ప్రాజెక్టు మరో రెండు గేట్లను అధికారులు ఎత్తారు. మూడు గేట్ల ద్వారా 10 వేల క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి విడుదల చేస్తున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1404.50 అడుగుల (17.079 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది. ఎగువ నుంచి 10 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లోగా వస్తుండటంతో అంతే మేర నీటిని మంజీరలోకి వదులుతున్నారు.

‘సింగూరు’ నీటి విడుదల

కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ఎగువ నుంచి వరద కొనసాగుతుండటంతో గురువారం మధ్యాహ్నం సింగూరు ప్రాజెక్టు రెండు వరద గేట్లను ఎత్తి 16,284 క్యూసెక్కులు, జెన్‌కో గేట్ల ద్వారా 2,822 క్యూసెక్కుల నీటిని మంజీరలోకి విడుదల చేస్తున్నారు. గేట్లను ఎత్తివేయడంతో మంజీర నది పరీవాహక ప్రాంత ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని నీటి పారుదలశాఖ అధికారులు సూచించారు.

బియ్యం తరలింపులో ఇష్టారాజ్యం!

- ఎల్లారెడ్డి పౌరసరఫరాల గోదాంలో అక్రమాలు
- ఒకే లారీలో బియ్యం లోడింగ్‌తో రెండు బిల్లుల వసూలు
- కాలం చెల్లిన లారీలతో ట్రాన్స్‌పోర్టు
- పట్టించుకోని అధికారులు



స్టేజ్ -2కు కేటాయించిన లారీలో స్టేజ్-1 గోదాంలో బియ్యం లోడ్ చేస్తున్న దృశ్యం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పౌర సరఫరాల గోదాములో అధికారులు నిబంధనలు పాటించడం లేదు. ఒకే లారీలో బియ్యం నింపి దానికి రెండు బిల్లులు మంజూరు చేశారు. అధికారుల అండదండలతో కాలం చెల్లిన లారీని కాంట్రాక్టర్ కొనసాగిస్తున్నాడు. రాష్ట్ర అధికారుల ఆదేశాలను కూడా అధికారులు బేఖాతరు చేస్తున్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని సివిల్ సప్లయిస్ గోదాంకు మెయిన్ గోదాం ద్వారా బియ్యాన్ని స్టేజ్-1 కాంట్రాక్టర్ సరఫరా చేయాల్సి ఉంటుంది. స్టేజ్-2 కాంట్రాక్టర్ సివిల్ సప్లయిస్ గోదాం నుంచి బియ్యాన్ని రేషన్ దుకాణాలకు సరఫరా చేయాలి. కానీ అధికారులు అండదండలతో ఎల్లారెడ్డి పౌర సరఫరాల శాఖ కాంట్రాక్టర్ రేషన్ దుకాణాలను సరఫరా చేసే లారీలో(ఏపీ 28 టీవీ 1389) మెయిన్ గోదాంలో నింపి డైరెక్ట్‌గా రేషన్ దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. నిబంధనల ప్రకారం 2010 తర్వాత మోడల్‌కు సంబంధించిన లారీలతో బియ్యం రేషన్ దుకాణాలకు ట్రాన్స్‌పోర్టు చేయాలి. కానీ 2008 మోడల్ లారీని కాంట్రాక్టర్ వినియోగిస్తున్నారు.

టెండర్‌లో ఒకటి.. ఇప్పుడు మరొకటి

కాంట్రాక్టర్ టెండర్ వేసిన సమయంలో టీఎస్ 01యూఏ 3020, ఏపీ 24టీబీ 1319, టీఎస్ 16యూబీ 6994, టీఎస్ 16 యూబీ 2754, ఏపీ 25డబ్ల్యూ 4786, టీఎస్ 15యూసీ 6191, టీఎస్ 17టీ 2621 నంబర్లు గల లారీల ద్వారా రేషన్ దుకాణాలకు బియ్యాన్ని సరఫరా చేస్తానని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం రెండు లారీల ద్వారా మాత్రమే బియ్యం సరఫరా చేస్తున్నారు. అందులో ఒకటి(ఏపీ 28 టీఏ 1389) అప్పుడు చూపెట్టిన లారీ కాకుండా కాలం చెల్లింది కావడం గమనార్హం. టెండర్‌లో ఇచ్చిన నంబర్ గల లారీలకే అధికారులు జీపీఎస్ బిగించాల్సి ఉన్నా ఏపీ 28 టీఏ 1389 నంబర్ గల లారీకి జీపీఎస్‌ను బిగించి కొనసాగిస్తున్నారు. స్టేజ్ 1, స్టేజ్ 2కు ఒకే లారీలో బియ్యం నింపి దానిని గోదాంలో అన్‌లోడింగ్ చేయకుండా డైరెక్టుగా రేషన్ దుకాణానికి తరలిస్తున్నారు.

కాంట్రాక్టర్‌కు సూచించాం



కాంట్రాక్టర్‌కు నిబంధనల ప్రకారం టెండర్‌లో చూపిన లారీల ద్వారా రేషన్ బియ్యం రవాణా చేయాలని సూచించాం. నిబంధనల ప్రకారం లారీలు అందుబాటులో లేక పోవడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాం.
– బాలయ్య, ఎల్లారెడ్డి పౌరసరఫరాల గోదాం ఇన్‌చార్జి

వంతెనకు మరమ్మతులు చేపట్టాలి

- ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

మాచారెడ్డి: ఇటీవల కురిసిన వర్షాలకు తెగిపోయిన పాల్వంచ మండలం భవానీపేట- పోతారం గ్రామాల మధ్య ఉన్న వంతెనను గురువారం ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తెగిన వంతెనకు వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. అలాగే నియోజకవర్గంలో వరదలకు దెబ్బతిన్న పంటలకు పరిహారం చెల్లించాలన్నారు. అనంతరం మండలంలోని లాచ్చాపేట, మంతన్ దేవునిపల్లిలో వరదలో కొట్టుకుపోయి మృతి చెందిన కైరంకొండ శివరాములు, కామటి నర్సయ్య కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. నాయకులు సురేష్, అనిల్, వెంకట్‌రెడ్డి, మదనాల శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్, భాస్కర్‌రెడ్డి, నరేష్, సత్యం ఉన్నారు.



భవానీపేట- పోతారం మధ్య ఉన్న వంతెనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

‘డబుల్’ ఇళ్ల కేటాయింపు



ఇళ్ల కేటాయింపు కోసం డ్రా తీస్తున్న ఆర్డీవో రంగనాథ్‌రావు

- నంబురాలు చేసుకున్న లబ్ధిదారులు

సాక్షి ఎఫెక్ట్..

భిక్కనూరు : మండలంలోని బస్వాపూర్, సిద్దరామేశ్వరనగర్ గ్రామాల్లో ఇళ్లు లేని నిరుపేదలకు అధికారులు గురువారం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను డ్రా పద్ధతిలో కేటాయించి తాళాలను అందజేశారు. గత కలెక్టర్ జితేష్ వి పాటిల్ గతేడాది అక్టోబర్ ఏడో తేదీన పెద్దమల్లారెడ్డి వెళ్లే దారిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూంలను బస్వాపూర్ గ్రామానికి చెందిన ఇళ్లు లేని 42 మందికి సిద్దరామేశ్వరనగర్ గ్రామానికి చెందిన ఎనిమిది మందికి కేటాయించారు. తదుపరి ఎన్నికలకోడ్ రావడంతో లబ్ధిదారులకు నంబర్లు కేటాయించలేదు. దీంతో అధికారుల చుట్టూ తిరిగిన లబ్ధిదారులు వారు స్పందించకపోవడంతో నేరుగా డబుల్ ఇళ్లలోకి వెళ్లిపోయారు. దీంతో వారిని పోలీసులు బలవంతంగా ఖాళీ చేయించారు. ఈ విషయమై ‘సాక్షి’లో ‘కేటాయించారు.. పొమ్మన్నారు’ శీర్షికతో కథనం రావడంతో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ స్పందించారు. ఆర్డీవో రంగనాథ్‌రావు, తహసీల్దార్ శివప్రసాద్‌ను పిలిపించి వివరాలు తెలుసుకున్నారు. పాత కలెక్టర్ కేటాయించిన ఇళ్లను వెంటనే నంబర్లను డ్రా పద్ధతిలో కేటాయించి లబ్ధిదారులకు తాళాలు అప్పగించాలని ఆదేశించారు. దీంతో ఆర్డీవో రంగనాథ్‌రావు, తహసీల్దార్ శివప్రసాద్, ఎస్సై సాయికుమార్ డబుల్‌బెడ్‌రూంల వద్దకు వెళ్లి లబ్ధిదారులు సమక్షంలో డ్రాతీసి తాళాలు అప్పగించారు. దీంతో లబ్ధిదారులు కలెక్టర్‌కు, ‘సాక్షి’కి కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయుల పాత్ర చాలా గొప్పది

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



ఉత్తమ ఉపాధ్యాయురాలికి అవార్డు అందజేస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అధికారులు

కామారెడ్డి క్రైం: సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా గొప్పదని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు జాతి నిర్మాతలన్నారు. ఉపాధ్యాయుల సహకారంతోనే మనమందరం ఈ స్థాయికి చేరుకున్నామన్నారు. విద్యార్థులకు గుణాత్మక బోధన చేస్తూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు కష్టపడి పనిచేసి విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయాలన్నారు. పదో తరగతి పరీక్షలలో జిల్లాను టాప్ 5 లో ఉంచేలా కృషిచే చేయాలన్నారు. చదువుతో పాటు క్రీడలలో విద్యార్థులను ప్రోత్సాహించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలిస్తూ నాణ్యతగా ఉండేలా చూడాలన్నారు. గురుకుల విద్యార్థులు కుటుంబాలకు దూరంగా ఉంటారని వారికి అన్ని రకాలుగా తోడుగా ఉండాలన్నారు. జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి గురువుల ఔన్నత్యాన్ని గుర్తు చేశారు. డీఈవో రాజు ఈ సందర్భంగా విద్యారంగంలో జరుగుతున్న ప్రగతిని వివరించారు. జిల్లా సాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 28 మందిని సన్మానించారు. కార్యక్రమంలో విద్యాశాఖ సమన్వయకర్తలు ఉమారాణి, వేణుగోపాల్, నాగవేందర్, కృష్ణ చైతన్య, వెంకటరమణరావు, జిల్లా పరీక్షల విభాగ అసిస్టెంట్ కమిషనర్ బలరాం, పరీక్షల విభాగ కార్యదర్శి నీలం లింగం తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతిని పూజించాలి

కామారెడ్డి క్రైం: మట్టి గణపతిని పూజించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రజలకు సూచించారు. గురువారం తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి మట్టి గణపతులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. పర్యావరణానికి నష్టం జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలుష్య నియంత్రణ మండలి ద్వారా మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సీపీవో రాజారామ్, జెడ్పీ సీఈవో చందర్ నాయక్, డీపీవో శ్రీనివాస్, డీడబ్ల్యూవో బావయ్య తదితరులు పాల్గొన్నారు.



మట్టి గణపతిని అందజేస్తున్న కలెక్టర్

వర్షం మిగిల్చిన నష్టం



కామారెడ్డి పెద్ద చెరువుకు వెళ్లే దారిలో..



అశోక్‌నగర్ కాలనీ ప్రధాన రోడ్డుపై గుంతలు

- కామారెడ్డిలో ధ్వంసమైన రోడ్లు

కామారెడ్డి టౌన్: జిల్లాలో ఇటీవల కురసిన భారీ వర్షాలకు మున్సిపల్ పరిధిలోని ప్రధాన రోడ్లతో పాటు పలు కాలనీల్లో రోడ్లన్ని ధ్వంసం అయ్యాయి. రోడ్లు పలు రోడ్లు కోతకు గురికాగా మరి కొన్ని కంకర, తారు తేలిపోయి గుంతలమయం అయ్యాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జన్మభూమి రోడ్డు, అశోక్‌నగర్, గోదాం రోడ్డు, విద్యానగర్ కాలనీ, సాయిబాబారోడ్డు, పంచముఖి హనుమాన్ కాలనీ, సిరిసిల్లారోడ్, పాతబస్టాండ్ నుంచి అడ్లూర్ మార్గంలో, హౌజింగ్‌బోర్డు కాలనీలో రోడ్లు ధ్వంసమయ్యాయి. రోడ్లకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



కామారెడ్డి పట్టణంలోని టీచర్స్ కాలనీలో ధ్వంసమైన రోడ్డు



టీచర్స్ కాలనీలో కోతకు గురైన రోడ్డు



పంచముఖి హనుమాన్ ఆలయం ఎదుట..

రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న ఉపాధ్యాయులు





అవార్డు అందుకుంటున్న సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, ఉపాధ్యాయుడు రామకృష్ణ

సాక్షి, కామారెడ్డి/భిక్కనూరు : రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో అవార్డు అందుకున్నారు. జిల్లాలోని చిన్నమల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు రామకృష్ణ, పాల్వంచ ఉన్నత పాఠశాల టీచర్ స్వర్ణలత, సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్ అవార్డులు అందుకున్నారు. తెలంగాణ యూనివర్సిటీ ఏర్పడిన తర్వాత తొలిసారిగా సుధాకర్‌గౌడ్‌కు ఈ పురస్కారం లభించింది. వీరికి మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహదారు కేశవరావు తదితరులు అవార్డు అందజేశారు.

క్లుప్తంగా

కనీస వేతనం చెల్లించాలి



కామారెడ్డి టౌన్ : ఆశా కార్యకర్త డిమాండ్లను పరిష్కరించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం డీఎంహెచ్‌వో చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఇందిర మాట్లాడారు. తక్షణమే కనీస వేతనం రూ. 26వేలు చెల్లించాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యూటీ, పెన్షన్, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. నాయకులు మమత, లత,పద్మ, జయ, రమాదేవి, మంజుల, సుజాత తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ రహిత సమాజానికి కృషి



భిక్కనూరు : హెచ్ఐవీ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహాయ సంచాలకులు ప్రసాద్ అన్నారు. గురువారం భిక్కనూరు మండల కేంద్రంలో వైఆర్‌జీ కేర్ లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో హెచ్ఐవీ పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. హెచ్ఐవీ నివారణ జాగ్రత్తలతోనే హెచ్ఐవీ రహిత సమాజం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఎయిడ్స్ నివారణ సంస్థ ప్రతినిధి పీకే పత్ర, జీపీ ఈవో మహేష్‌గౌడ్, ఉమ్మడి జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ మేనేజర్ చల్ల సుధాకర్, లింక్ వర్కర్ స్కీం డీఆర్పీ గర్దాస్ సుధాకర్, సూపర్‌వైజర్ జ్యోతి లింక్ వర్కర్లు శివరాం, బాల్‌కిషన్ పాల్గొన్నారు.

అధ్యాపకుడి ఉదారత



రామారెడ్డి : భారీ వర్షాలకు ఇళ్లలోకి నీళ్లు రావడంతో రామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేసి బాధితులను తాత్కాలిక ఏర్పాట్లు చేశారు. గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిందీ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న రాజు పునరావాస కేంద్రంలో ఉన్న 150 మందికి అన్నదానం చేశారు. ఇదే కళాశాలలో తాత్కాలిక అటెండర్‌గా పనిచేస్తున్న లింగం అనే వ్యక్తి అన్నదానం చేయడాన్ని స్ఫూర్తిగా తీసుకుని లెక్చరర్ రాజు కూడా గురువారం బాధితులకు అన్నదానం చేయడంపై గ్రామస్తులు అభినందించారు.

కాంగ్రెస్ యువజన విభాగం సభ్యత్వ నమోదు



దోమకొండ : మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ ఆఫీస్‌లో గురువారం యువజన విభాగం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆన్‌లైన్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా యువజన విభాగం జిల్లా నాయకులు మధు, శ్రీనివాస్‌లు మాట్లాడారు. గ్రామాల్లో బూతుల వారిగా 35 సంవత్సరాలు నిండిన కార్యకర్తలను సభ్యులుగా చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంత రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు తిర్మల్‌గౌడ్, సీడీసీ మాజీ చైర్మన్ ఐరేని నర్సయ్య, మండల యువజన అధ్యక్షుడు ఆశబోయిన శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్రబోయిన స్వామి తదితరులున్నారు.

శిథిల గదుల్లో చదివేదెలా..?

- భయం గుప్పిట్లో విద్యార్థులు
- స్పందించని అధికారులు



మాచారెడ్డి మండల కేంద్రంలో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం

మాచారెడ్డి : విద్యార్థుల భవిష్యత్తు తరగతి గదిలో రూపుదిద్దుకుంటుందంటారు. కానీ ఆ తరగతి గది ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితిలో విద్యార్థులు ఉంటే వారి చదువులు సాగేదెలా? నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాలు మరింత శిథిలమై ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. మాచారెడ్డి ఉమ్మడి మండలంలో 31 ప్రాథమిక పాఠశాలలు, 6 యూపీఎస్, 12 ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, ఎస్టీ మినీ గురుకుల విద్యాలయాలు ఉన్నాయి. మొత్తం 49 ప్రభుత్వ పాఠశాలల్లో 5,980 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మాచారెడ్డి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల, చుక్కాపూర్, మైసమ్మ చెరువు తండా, సోమారంపేట ప్రాథమిక పాఠశాలలు, అలాగే పాల్వంచ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల, పోతారంలోని ప్రాథమికోన్నత పాఠశాల, భవానీపేట, ఇసాయిపేట గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి.

బిక్కుబిక్కుమంటూ..

తరగతిగదుల నిర్మాణం, మరమ్మత్తుల కోసం మన ఊరు మన బడి పథకం కింద నిధులు మంజూరైనప్పటికీ ప్రభుత్వం మారడంతో ఆ నిధులు వాపస్ పోయినట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. మాచారెడ్డి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద రూ. 80 వేలు మంజూరైనప్పటికి రూ. 40 వేలు వస్తే అవి సరిపోక అందరినీ ఒకే గదిలో కూర్చోబెట్టాల్సి వస్తోందని ఉపాధ్యాయులు తెలిపారు. ఎప్పుడు కూలుతాయో తెలియని దుస్థితిలో ఉన్న ప్రభుత్వ బడులకు పంపించలేక కొందరు తల్లి,దండ్రులు అప్పు జేసి తమ పిల్లల్ని ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు.

నివేదికలు పంపించాం



ఉమ్మడి మాచారెడ్డి మండలంలోని శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాల గురించి నివేదికలు తయారు చేసి పై అధికారులకు పంపించాం. ఇటీవల డీఈవో సైతం పాత భవనాల జాబితా పంపించమని చెప్పారు. త్వరలో నిధులు మంజూరవుతాయి. – ఎల్లయ్య, ఎంఈవో

మధ్యవర్తిత్వం.. సత్వర పరిష్కారం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల

ఖలీల్‌వాడి: కొలిక్కిరాని ఎన్నో సమస్యలు మధ్యవర్తిత్వంతో పరిష్కారమవుతాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ సునీత కుంచాల అన్నారు. జిల్లాకోర్టు ప్రాంగణంలోని న్యాయసేవ సదన్‌లో మధ్యవర్తిత్వ కేంద్రాన్ని సీపీ కల్మేశ్వర్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. కొలిక్కిరాని కుటుంబ వివాదాలు, ఆస్తి పంపకాల్లో అన్నాచెల్లెళ్ల మధ్య గొడవలు, రెండు సంస్థల వ్యాపారదేవీల్లో తగాదాలు, భార్యాభర్తల మనస్పర్థలు ఇలా అనేక విషయాల్లో సత్వర పరిష్కారం దిశగా మధ్యవర్తిత్వ కేంద్రం చేస్తుందని పేర్కొన్నారు. ఈ కేంద్రాన్ని అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థకు కలెక్టర్, పోలీస్ కమిషనర్ సంపూర్ణ సహకారాలు అందిస్తున్నారని అన్నారు. సెప్టెంబర్ 28న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌కు న్యాయవాదులు, న్యాయార్థులు సహకరించి విజయవంతం చేయాలన్నారు. అనంతరం సీపీ కల్మేశ్వర్ మాట్లాడుతూ.. మానవ సమూహాలలో నెలకొన్న ఆర్థిక, సామాజిక సమస్యలకు పరిష్కార వేదికలుగా మధ్యవర్తిత్వ కేంద్రాలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో న్యాయసేవా సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రాజ్‌కుమార్ సుబేదార్, న్యాయసేవా సంస్థ సూపరింటెండెంట్ రంగు వెంకట పురుషోత్తంగౌడ్, పారా లీగల్ వలంటీర్లు, న్యాయవాదులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి



కామారెడ్డి క్రైం : ఉద్యోగులు అందరూ అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను గురువారం కలెక్టరేట్‌లో ఘనంగా జరిపారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ హాజరయ్యారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల, డెయిరీ టెక్నాలజీ, జిల్లా లోని డిగ్రీ కళాశాలలకు చెందిన మొత్తం 21 మంది ప్రొఫెసర్లను కలెక్టర్ చేతుల మీదుగా సన్మానించారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ ఎం రాజన్న, వైస్ చైర్మన్ నాగరాజు గౌడ్, కార్యదర్శి రఘుకుమార్, రాష్ట్ర కమిటీ సభ్యుడు సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ వివరాల సేకరణ



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : నస్రుల్లాబాద్ మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం జరుగుతున్న రైతు రుణమాఫీ కుటుంబ సభ్యుల వివరాల సేకరణ కార్యక్రమాన్ని ఏడీఏ అనిల్ పరిశీలన చేశారు. రైతులు సంయమనం పాటించి వివరాలను సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు.

మూలవేతనం విరాళమివ్వడం హర్షణీయం



కామారెడ్డి టౌన్ : వరద బాధితులకు ప్రభుత్వ ఉద్యోగుల జేఏసి రాష్ట్ర నాయకత్వం, అన్ని సంఘాల నిర్ణయంతో ఒకరోజు మూల వేతనం సుమారు రూ.130 కోట్లను సీఎం సహాయ నిధికి చెల్లించడం జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, సాయిరెడ్డి, దామోదర్‌రెడ్డి, కుషాల్, సీహెచ్ అనిల్‌కుమార్, హన్మంత్ రెడ్డి, ముజీబొద్దీన్ తదితరులున్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

- పేషెంట్ గదిలో పైకప్పు పెచ్చులూడిన ఘటన



పేషెంట్ వార్డు గదిలో ఊడిన పైకప్పు

బోధన్: సాలూర పీహెచ్‌సీలో గురువారం రాత్రి ఆరోగ్య కేంద్రంలోని పేషంట్ వార్డు గది పై కప్పు పెచ్చులూడి పడింది. పీవోపీ రాడ్‌లు పెద్ద శబ్దంతో హఠాత్తుగా కూలిపోయి పడిపోవడంతో వైద్య సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. పేషంట్ వార్డులో రోగులెవరూ లేకపోవడంతో త్రుటిలో ప్రాణ ప్రమాదం తప్పింది. మరో గది కూలిపోయే దశకు చేరింది. దీంతో ఆస్పత్రికి తాళం వేశారు. ఘటన జరిగిన సమయంలో ఏఎన్ఎం, ఆశ వర్కర్, అటెండర్, ఒక రోగి ఉన్నారని వైద్యుడు డాక్టర్ జయప్రకాశ్ తెలిపారు. ఈ ఘటన సమాచారాన్ని జిల్లా వైద్యశాఖ అధికారికి సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ప్రైవేటు పాఠశాల బస్ సీజ్

నందిపేట్ : మండల కేంద్రంలో గురువారం రవాణా శాఖ తనిఖీలో నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న అక్షర పాఠశాల బస్సును అధికారులు సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వివేకానంద రెడ్డి మాట్లాడుతూ.. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే బస్సులను ఫిట్‌నెస్ చేయించుకోవాలని, పాఠశాలల బస్సులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీలో పాఠశాల బస్సుకు సరైన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

సబ్ కలెక్టర్ సుడిగాలి పర్యటన



నస్రుల్లాబాద్‌లో అంగన్‌వాడీ చిన్నారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : నస్రుల్లాబాద్ మండలంలో గురువారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సుడిగాలి పర్యటన చేశారు. మండలంలోని నాచుపల్లిలో మినీ గురుకుల బాలుర పాఠశాలను పరిశీలించారు. పాఠశాల ప్రాంగణం అపరిశుభ్రంగా ఉండటంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటరు సర్వేను పరిశీలించారు. మండల కేంద్రంలోని అంగన్వాడీ సెంటర్–1 ను పరిశీలించారు. పౌష్టికాహారం అందించాలని సూపర్‌వైజర్ వాణి, అంగన్‌వాడీ టీచర్ గౌరమ్మను ఆదేశించారు.

భోజనానికి ముందు పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా లేకపోవడంతో నస్రుల్లాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సిబ్బందిపై సబ్‌కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాస్ పర్సంటేజీ తక్కువ ఉందని ఈసారి పెంచెలా చర్యలు తీసుకోవాలన్నారు. గేమ్స్ పిరియడ్ తప్పనిసరిగా ఉండాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. పాఠశాలలో డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిలో పాల్గొన్నారు. ఆమె వెంట తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంఈవో నాగేశ్వర్ రావు, ఎంపీవో సూర్యకాంత్, గిర్దావార్ అంజు, పీఆర్‌టీయూ మండల అధ్యక్షులు హన్మాండ్లు,హెచ్ఎం చందర్ తదితరులున్నారు. నాచుపల్లిలో గత వారం పిడుగు పాటుకు గురై మరణించిన స్వాతి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ విద్యుత్ శాఖాధికారులతో మాట్లాడి నష్టపరిహారం అందేలా చూస్తామన్నారు.

త్వరలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం



మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, తదితరులు

దోమకొండ : దోమకొండ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని, ముప్పై పడకల ఆస్పత్రిని, వంద పడకల ఆస్పత్రిగా మార్చాలని జెడ్పీటీసీ మాజీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ సూచన మేరకు ఆయన గురువారం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను పరిశీలించినట్లు తెలిపారు. వైద్యులు, వైద్య సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ఖాళీల భర్తీపై వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. వంద పడకల ఆసుపత్రి ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారన్నారు. 100 పడకల ఆసుపత్రి మంజూరుకు సంబంధించిన ప్రతిపాదన ప్రిన్సిపల్ సెక్రటరీ వద్ద ఉందన్నారు. తొందర్లోనే షబ్బీర్ అలీ చొరవతో దోమకొండలో వంద పడకల ఆస్పత్రి ఏర్పాటు కానుందన్నారు. మాజీ వైస్ ఎంపీపీ పుట్ట బాపురెడ్డి, మండలం కాంగ్రెస్ అధ్యక్షుడు అనంత రెడ్డి, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు సీతారాం, మధు తదితరులు పాల్గొన్నారు.



గోదావరిలో చేపల వేట

బాల్కొండ: ప్రాజెక్ట్ నుంచి వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదలను నిలిపి వేయడంతో యువకులు, స్థానికులు చేపల వేట చేపట్టారు. నీటి విడుదల తగ్గగానే చేపలు బయటకు రావడంతో వాటిని పట్టుకునేందుకు యువకులు, మత్స్యకారులు పోటీపడ్డారు. చేపలు పట్టిన మత్స్యకారులు విక్రయాలు చేపట్టారు.





బాధితుడికి అండగా నిలిచిన 'మనోరమ' వైద్యులు



చికిత్స పొందుతున్న బసవరాజు

నిజామాబాద్‌నాగారం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లిన బాధితుడికి నగరంలోని మనోరమ ఆస్పత్రి అండగా నిలిచి ఉచిత వైద్యం అందిస్తోందని న్యూరో సర్జన్ కట్ట నరసింహ అన్నారు. ఆస్పత్రిలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బిచ్కుందకు చెందిన బసవరాజ్ జూన్14న బడాపహాడ్ ప్రాంతంలో రోడ్డు ప్రమాదానికి గురికావడంతో కోమాలోకి వెళ్లాడు. మిత్రులు ఆస్పత్రిలో చేర్పించడంతో వైద్యం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. బాధితుడికి తల్లితండ్రులు లేకపోవడంతో గ్రామస్తులు కొందరు సహకారం అందించారని అన్నారు. ప్రస్తుతం అతని వద్దకు ఎవరూ రావడం లేదని అతని వైద్య చికిత్సలను నెలన్నర రోజులుగా ఆస్పత్రి భరిస్తోందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు రూ. ఆరు లక్షల వరకు ఖర్చు చేసిందన్నారు. ప్రస్తుతం అతనిని పరిస్థితి బాగానే ఉందని, పక్కనే ఉండి చూసుకునే వ్యక్తులు ఉంటే మరింత కోలుకుంటారని వారన్నారు.

నేడు ఎంపీ, ప్రభుత్వ సలహాదారు రాక

బీబీపేట : మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేడు ఉచితంగా పంపిణీ చేయనున్న మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమానికి ఎంపీ సురేష్ షెట్కార్, ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ రానున్నారని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుతారి రమేష్, ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డా పెరమాండ్ల ప్రకటనలో తెలిపారు.

క్రైం కార్నర్

జీవితంపై విరక్తితో ఆత్మహత్య



లింగమణి మృతదేహం

ఖలీల్‌వాడి: మనస్తాపంతో అనారోగ్యానికి గురైన ఓ మహిళ ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు నాలుగో టౌన్ ఎస్సై ఉదయ్‌కుమార్ గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని నాలక్కల్ రోడ్డుకు చెందిన లింగమణి(49) భోజారాం దంపతులు. వీరికి ముగ్గురు కుమార్తెలు కాగా వివాహాలు అయ్యాయి. మూడేళ్ల క్రితం భోజారాం అనారోగ్యంతో మృతి చెందాడు. నాటి నుంచి లింగమణి అనారోగ్యంతో బాధపడుతోంది. పలు ఆస్పత్రుల్లో చూయించినా నయం కావడం లేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె మనస్తాపంతో బాత్‌రూంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పెద్ద కుమార్తె ప్రశాంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

భాగ్యనగర్‌లో చోరీ

నిజామాబాద్ రూరల్: ఒకటో డివిజన్ ఖానాపూర్ పరిధిలోని భాగ్యనగర్‌లో చోరీ జరిగింది. ఎస్‌హెచ్‌వో ఆరిఫ్ గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. భాగ్యనగర్‌కు చెందిన లావణ్య ఇంట్లో బుధవారం రాత్రి దుండగుడు చొరబడి ఆమె మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసును లాక్కొని వెళ్లిపోయాడన్నారు. నిందితుడు ముఖానికి మాస్క్ ధరించి వివరాల సేకరణ కోసం వచ్చి చోరీకి పాల్పడ్డాడని బాధితురాలు పేర్కొంది. లావణ్య భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

మామిడిపల్లిలో..

ఆర్మూర్‌టౌన్: మామిడిపల్లిలో ఉన్న తిరుమల కాలనీలో ఓ ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. కాలనీకి చెందిన మహేశ్ పనినిమిత్తం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లాడు. గురువారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. చోరీకిలో నాలుగు తులాల బంగారం, కొంత నగదు దుండగులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో రవికుమార్ పేర్కొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

బోధన్ టౌన్: డ్రంకన్ డ్రైవ్ కేసులో ఒకరికి రెండు రోజుల జైలు శిక్షను విధిస్తూ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ తీర్పు వెల్లడించారని బోధన్ టౌన్ సీఐ వెంకటనారాయణ గురువారం తెలిపారు. పట్టణంలో వాహనాల తనిఖీ చేపడుతుండగా మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు. సాక్షాలను పరిశీలించిన జడ్జి రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానా విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి



రవీందర్‌రెడ్డి(ఫైల్)

మోపాల్: డిచ్‌పల్లి మండలంలోని బర్దిపూర్ గ్రామానికి చెందిన బూర్గుపల్లి రవీందర్‌రెడ్డి(51) తన వ్యవసాయ క్షేత్రంలో ప్రమాదవశాత్తు పడి మృతిచెందినట్లు డిచ్‌పల్లి ఎస్సై మహ్మద్ షరీఫ్ గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. రవీందర్‌రెడ్డి రోజువారీగా ఉదయం తన పొలం వద్దకు వెళ్లాడు. మధ్యాహ్నమైనా ఇంటికి రాకపోవడం, ఫోన్ చేస్తే స్పందించకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబీకులు పొలం వద్దకు వెళ్లి చూశారు. పొలంలో విగతజీవిగా కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామ నిర్వహించారు. మృతుడి భార్య ఉమారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

విద్యుత్‌షాక్‌తో రైతు..

వర్ని: విద్యుత్‌షాక్‌తో ఓ రైతు మృతి చెందిన ఘటన మండలంలోని జలాల్‌పూర్ శివారులో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వెంకన్న(55) అనే రైతు తన పొలానికి వెళ్తుండగా పొలంలోని విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు తగిలాయి. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబీకులు పొలంలో చూడగా విగతజీవిగా గుర్తించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

కారు ఢీకొని..



సత్యం(ఫైల్)

దోమకొండ: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని కారు వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన గజం సత్యం(55) కూలీ పని కోసం అంచనూరు గ్రామానికి నడుచుకుంటు వెళ్తుండగా ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో వెనుక నుంచి వచ్చిన కారు వేగంగా ఢీకొన్నది. ఘటనలో తీవ్రంగా గాయపడ్డ సత్యంను స్థానికులు 108 అంబులెన్స్‌లో కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి బావ రాజనర్సు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, పిల్లలు లేరని బంధువులు తెలిపారు.

ఇద్దరి బైండోవర్



గాంధారి: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో ఎలాంటి గొడవలు జరగకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా గతంలో గొడవలకు పాల్పడే ఇద్దరిని డిప్యూటీ తహసీల్దార్ రవి ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై ఆంజనేయులు గురువారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన సంజయ్‌సింగ్, కోరే మల్లయ్యను బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది ఉన్నారు.

భర్తకు తలకొరివి పెట్టిన భార్య



నాగిరెడ్డిపేట: వారిద్దరు అన్యోన్య దంపతులు.. కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడుగా నిలిచి జీవనం సాగించారు. ఇంతలో విధి వారిబంధాన్ని విడదీసింది. దాంతో భర్తకు తలకొరివి పెట్టి రుణం తీర్చుకుంది. ఈ ఘటన మండలంలోని గోపాల్‌పేటలో గురువారం చోటు చేసుకుంది. గోపాల్‌పేటకు చెందిన ఎరుకల నారాయణ(38) అనారోగ్యంతో బాధపడుతూ ఉదయం మృతి చెందాడు. ఆయనకు భార్య మంజులతో పాటు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారులు లేక పోవడంతో భర్తకు తలకొరివి పెట్టి రుణం తీర్చుకుంది. కాగా అందరితో కలుపుగోలుగా ఉండే నారాయణ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

అమర జవాన్ స్థూపాన్ని ఢీకొన్న కారు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్‌లో ఉన్న అమరజవాన్ స్థూపాన్ని బుధవారం రాత్రి ఓ కారు ఢీకొన్నది. మద్యం మత్తులోనే కారు డ్రైవర్ స్థూపాన్ని ఢీకొన్నట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు గురువారం తెలిపారు. కాగా డ్రైవర్ కారును వదిలేసి పారిపోయినట్లు పేర్కొన్నారు.